క్లుప్తంగా

పంటనష్ట పరిహారం మంజూరు



వ్యవసాయ సహాయకులతో మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: 2022 ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేసిందని ఏఓ మల్లేష్‌కుమార్ తెలిపారు. సచివాలయ వ్యవసాయ సహాయకులతో సమావేశమైన ఆయన మండలంలో పత్తి, వేరుశనగ, జొన్న, ఉల్లి పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. లబ్ధిదారుల జాబితాలను శుక్రవారం ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు. రైతులు వ్యవసాయ సహాయకులను సంప్రదించి, అర్హుల జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే జులై 4వ తేదీలోగా మార్పులు చేయించుకోవాలని ఏఓ సూచించారు.

ప్రజల ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న సీఐ శ్రీధర్

సి.బెళగల్: ప్రజల ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని సీఐ శ్రీధర్ పోలీస్ సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులు వివరాలను ఎస్ఐ పీరయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ మధ్యకాలంలో నమోదైన కేసులు, ప్రజల ఫిర్యాదులపై సమీక్ష సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, పోలీసులను ఆశ్రయించిన బాధితులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు. భూ తగాదాలను సివిల్ కోర్టులు, రెవెన్యూ పరిధిలో పరిష్కరించుకునేలా ప్రజలకు సూచించాలని చెప్పారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌ల నియామకం

సి.బెళగల్: జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లను వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. సి.బెళగల్ మండలం జేసీఎస్ ఇన్‌చార్జ్‌గా సీబీ తులసీరెడ్డి, గూడూరు – మహేశ్వరరెడ్డి, గూడూరు పట్టణం – ఎల్ వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలోని కర్నూలు మున్సిపాలిటీకి చెందిన క్లస్టర్ – 1లోని 38, 39, 40 వార్డులకు హెచ్ సతీష్ కుమార్ నియామకమయ్యారు. కోడుమూరు మండలానికి మధుమోహన్‌రెడ్డి, కర్నూల్ రూరల్ – సత్యంరెడ్డికి జేసీఎస్ పదవులు అప్పగిస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.
పాణ్యం: జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌ను వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. పాణ్యం మండల ఇన్‌చార్జ్‌గా మద్దూరు గ్రామానికి చెందిన గుద్దెటి సుమంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. పార్టీ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని సుమంత్‌రెడ్డి తెలిపారు.

కేసీ కాల్వకు 189 క్యూసెక్కులు విడుదల

గూడూరు: సుంకేసుల డ్యామ్ నుంచి కర్నూలు నగర ప్రజలకు తాగు నీటి అవసరాల నిమిత్తం 189 క్యూ సెక్కుల నీటిని విడుదల చేసినట్లు గురువారం అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో నిలిచి పోయిందని, డ్యామ్‌లో 1.068 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(రూరల్): జిల్లాలో గ్యాస్ పైప్ లైన్ పనులు నాసిరకంగా చేపడుతున్న హెచ్‌పీసీఎల్ సంస్థ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్ణాటక రాష్ట్రం హసన్ నుంచి తెలంగాణ రాష్ట్రం చంచల్‌గూడ వరకు వేసిన గ్యాస్ పైపు లైన్ జిల్లాలోని తుగ్గలి మండలంలో ప్రారంభమై కర్నూలు మండలం సింగవరం వద్ద తెలంగాణలోకి వెళ్తుందన్నారు. జిల్లాలో పైపులైన్ కోసం తీసిన గుంతలను మెత్తటి మట్టి, ఇసుకతో కాకుండా రాళ్లతో నింపడం వల్ల కొన్నిచోట్ల వాగులు వచ్చి కోతకు గురైందన్నారు. పైపులైన్ బయటకు రావడం ద్వారా గ్యాస్ లీకు అయితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఏకలవ్యుని జయంతిని ప్రభుత్వం నిర్వహించాలి

కర్నూలు(అర్బన్): విలువిద్యలో గురువును మించిన శిష్యునిగా పురాణాల్లో ప్రసిద్ధి చెందిన ఏకలవ్యుని జయంతిని ప్రభుత్వం నిర్వహించాలని ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై రాజు కోరారు. ఏకలవ్యుని జయంతిని పురస్కరించుకుని స్థానిక వైహెచ్‌పీఎస్ కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వై రాజు మాట్లాడుతూ విలు విద్యలో సాటిలేని వీరుడైన ఏకలవ్యుడు మనువాదుల కుట్రలకు బలయ్యారన్నారు. కార్యక్రమంలో పత్తికొండ తాలూకా అధ్యక్షులు ఎరుకల పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



ప్రార్థనలో పాల్గొన్న ముస్లిం సోదరులు

కోడుమూరు రూరల్ : త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకలను గురువారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని ఉదయాన్నే ముస్లిం సోదరులు నూతన వస్త్రాలు ధరించి స్థానిక ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఈద్గాకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే మండలంలోని పులకుర్తి, క్రిష్ణాపురం, వర్కూరు, ప్యాలకుర్తి, లద్దగిరి, అమడగుంట్ల తదితర గ్రామాల్లో మసీదులు, ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.
పాణ్యం: మండలంలో గురువారం బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముస్లిం సోదరులు ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పాణ్యంలో ఎంపీడీఓ కార్యాలయం పక్కన ఉన్న ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ ప్రాముఖ్యతను మతపెద్దలు వివరించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్న ఎస్ఐ సుధాకర్‌రెడ్డిరికి ముస్లిం పెద్దలు సన్మానించారు.
గూడూరు: పట్టణంలో గురువారం బక్రీద్ వేడుకలు ప్రశాంతగా జరిగాయి. ఎమ్మిగనూరు రహదారి వైపున్న ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

గడివేముల: త్యాగానికి ప్రతీక బక్రీద్ వేడుకలను గురువారం ముస్లింలు సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాలు కిక్కిరిశాయి. ముస్లింలు పేదలకు దానధర్మాలు చేశారు. మండల కేంద్రం గడివేములతోపాటు గ్రామాల్లో ఇమామ్‌లు బక్రీద్ పండుగ సందేశాన్ని వివరించారు. ఇతరులపై ప్రేమ,సహాయం చేసే విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మత పెద్దలు మాట్లాడుతూ త్యాగానికి బక్రీద్ పండుగ నిదర్శనం అని, ప్రతి ఒక్కరూ త్యాగ గుణం అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కోడుమూరు సీఐ శ్రీధర్, స్థానిక ఎస్ఐ పవన్‌కుమార్ ముస్లింలకు ఈద్ ముబారక్ తెలిపారు.
కల్లూరు: మండలంలో బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. త్యాగాలు, దానధర్మలకు ప్రతీకగా నిలిచే బక్రీద్(ఈద్–ఉల్–ఆదా) పండుగను ముస్లిం సోదరులు ప్రశాంతగా జరుపుకున్నారు. మతపెద్దలు ఖురాన్‌ను చదివి వినిపించారు. అనంతరం



కోడుమూరులోని ఈద్గాలో బక్రీదు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



గడివేముల ఈద్గాలో బక్రీద్ పండుగ సందేశాన్ని వివరిస్తున్న మత గురువు

ఒకరినొకరు ఆలింగినం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.
సి.బెళగల్: త్యాగానికి ప్రతీక అయిన ఈద్ ఉల్ ఆదా (బక్రీద్)ను గురువారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రం సి.బెళగల్‌లో ఢిల్లీ నుంచి వచ్చిన హఫీసాబ్ బక్రీద్ ప్రాముఖ్యతను వివరించారు. త్యాగాలను, శాంతి స్వభాలవాలను కలిగి ఉండాలని బోధించారు. అదేవిధంగా త్యాగం, శాంతి ఫలితాలను వారు వివరించారు.
ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లుతోపాటు గ్రామాల్లో గురువారం బక్రీద్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాల్వ, హుసేనాపురం, నన్నూరు, ఓర్వకల్లు, పూడిచెర్ల, ఉయ్యాలవాడ తదితర గ్రామాలలో ముస్లింలు సోదరులు ఉదయాన్నే స్నానాలాచరించి నూతన వస్త్రాలు ధరించి ఈద్గాలకు వెళ్లారు. ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. మత పెద్దలు ఖురాన్ సారాంశాన్ని వివరించారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.







మసీదులో ప్రార్థనలో పాల్గొన్న ముస్లిం సోదరులు,సి.బెళగల్ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలో ముస్లింలు,ఓర్వకల్లులో జరిగిన ప్రార్థనలో పాల్గొన్న ముస్లిం సోదరులు

వాస్తవాలు తెలుసుకోరా?

- ధ్వజమెత్తిన జెడ్పీటీసీ సభ్యుడు చంద్రశేఖర రెడ్డి



గడివేముల: తెలుగు తమ్ముళ్ల తీరును జెడ్పీటీసీ సభ్యుడు చంద్రశేఖర రెడ్డి తప్పుపట్టారు. వాస్తవాలు తెలుసుకోకుండా దుష్ప్రచారం ఏమిటని ధ్వజమెత్తారు. గడివేములకు చెందిన సిద్ధక్క గారి గోపాల్ కుటుంబంపై పచ్చపత్రిక కట్టుకథ అల్లడం దాన్ని సాకుచూపుతూ తెలుగు తమ్ముళ్ల ఇష్టం వచ్చినట్లు ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. దివ్యాంగులైన గోపాల్ కుమారుడు కుమార్తెలు వెంకటపవన్,తేజస్వీని రెండేళ్లుగా అమ్మఒడి రాలేందంటూ పచ్చపత్రిక ప్రచురించడం... టీడీపీ నాయకులు అదేపనిగా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని గురువారం జెడ్పీటీసీ ఖండించారు. దివ్యాంగులైన వెంకటపవన్, తేజస్వీనికి గతేదాడిద అమ్మఒడి వచ్చిందన్నారు. దురదష్టవశాత్తు తల్లి మరణించడంతో తలెత్తిన సాంకేతిక లోపంతో ఈ ఏడాది అమ్మఒడి సొమ్ము జమ కాలేదన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే సంబంధిత వలంటీర్ సచివాలయానికి సమాచారం కూడా ఇచ్చారని తెలిపారు. అయినా ప్రభుత్వం అన్యాయం చేసిందంటూ ప్రచారం సిగ్గు చేటన్నారు. టీడీపీ మద్దతుదారులని అమ్మఒడి అందిచడం లేదని ఆరోపణలు తగదన్నారు. ఆ ఇద్దరు పిల్లలకు ఇప్పటికే దివ్యాంగ కోటా కింద ప్రతి నెల ఇంటి వద్దకే వలంటీర్ పింఛన్ అందజేస్తున్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఓ సారి సచివాలయంలో సంప్రదిస్తే వాస్తవాలు తెలుస్తాయని సూచించారు. పార్టీలకు అతీతంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందని, ఏ ఒక్క పేదకు అన్యాయం జరగ కూడదని ప్రత్యేకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్న విషయాన్ని తమ్ముళ్లు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. తప్పుడు ప్రచారాలకు పాల్పడితే ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఔషధాల నేరేడు..!



కోడుమూరు రూరల్: వర్షాకాల ప్రారంభ సమయంలో మాత్రమే అరుదుగా దొరికే నేరేడు పండ్లకు ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. నేరేడు పండ్లలో కాల్షియం, ఐరన్, పొటాషియం, విటమిన్లు ఏ,సీ విటమిన్లు సమృద్ధిగా ఉండడంతో పాటు, రోగ నిరోధక శక్తిని పెంచే ఎన్నో ఔషద గుణాలుండడం, బీపీ, షుగర్ వంటి జబ్బులను తగ్గించే గుణం ఉండడంతో ప్రజలు విరివిగా ఈ పండ్లను కొంటున్నారు. కిడ్నీలలో ఉండే రాళ్లను సైతం కరిగించే శక్తి ఉండడంతో నేరేడు పండ్లను తినేందుకు ప్రజలు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. ఆదోని, కోసిగి వంటి ప్రాంతాల నుంచి ప్రతి రోజు వ్యాపారులు వచ్చి కోడుమూరులో నేరేడు పండ్లను విక్రయిస్తున్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం హుండీ కానుకల లెక్కింపు చేపడుతున్నట్లు ఈఓ రామకృష్ణ గురువారం తెలిపారు. అలాగే జూలై 3వ తేదీన భక్తులు అన్నదానికి ఇచ్చిన మిశ్రమ బియ్యాన్ని కూడా బహిరంగా వేలం పాటు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గలవారు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

మంత్రాలయంలో భక్తుల కోలాహలం



దర్శన క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల కోలాహలం నెలకొంది. ఆషాడమాసం శయన తొలి ఏకాదశి కావడం, బక్రీద్ పర్వదినం సెలవు రావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచే భక్తులు దర్శనార్థం బారులు తీరారు. రాఘవేంద్రుల మూల బృందావన దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. ఏకాదశి సందర్భంగా భక్తులకు బృందావన నిజరూప దర్శనం కల్పించారు. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. మంత్రాలయంలోని జాతీయ రహదారితోపాటు వీధులన్నీ వాహనాలతో కిక్కిరిశాయి. ఏకాదశి కావడంతో శ్రీమఠంలో భోజనాలకు, పరిమళ ప్రసాదాలకు విరామం ఇచ్చారు. ఈ నేపథ్యంలో హోటళ్లు, ప్రైవేటు లాడ్జీలు,టిఫిన్ సెంటర్లు భక్తుల తాకిడితో కిటకిటలాడాయి. మఠం మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పాఠశాల స్థాయి పెంపు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని అమరావతి నగర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలలో మూడు నుంచి తొమ్మిదవ తరగతి వరకు 349 మంది విద్యార్థులు ఉన్నారని ప్రధానోపాధ్యాయురాలు కోమలదేవి తెలిపారు. ప్రస్తుతం అరు గదులు ఉన్నాయన్నారు. సబ్జెక్టుల ప్రకారం పది మంది ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. నాడు –నేడు కింద పాఠశాల అభివృద్ధికి రూ. 50 లక్షలు మంజూరైనట్లు వివరించారు. ఈ నిధులతో రెండు తరగతి గదులు, కిచెన్, బాత్‌రూమ్, టాయిలెట్స్ ఏర్పాటు పనులు చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాల స్థాయి పెంపుపై హర్షం వ్యక్తం చేశారు.

ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

కోడుమూరు రూరల్ : స్థానిక మోడల్ స్కూల్‌లో 7,8,9వతరగతుల్లో ఖాళీగా ఉన్న 14సీట్లకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతిలో 6సీట్లు, 8వతరగతిలో 4సీట్లు, 9వ తరగతిలో 4సీట్లు చొప్పున ఖాళీగా ఉన్నాయని, జూలై 1వతేదీ శనివారంలోగా మోడల్ స్కూల్లో సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

నేడు మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

ఓర్వకల్లు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో మిగిలిపోయిన సీట్లకు శుక్రవారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ జోషిలావాట్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 7,8,9 తరగతులలో మిగిలిన సీట్లకు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వివరాలతో విద్యార్థులు శుక్రవారం ఉదయం 9.30 గంటల లోపు పాఠశాల వద్దకు చేరుకోవాలని ఆమె సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు సమీపాన రాగమయూరీ విద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నన్నూరు గ్రామానికి చెందిన జలాలుద్దీన్ ద్విచక్రవాహనంపై రాగమయూరి నుంచి జాతీయ రహదారిపైకి వెళ్తున్నాడు. అదే సమయంలో నంద్యాల నుంచి కర్నూలు వైపు అతివేగంతో వస్తున్న ఏపీ 39 ఎస్‌వై 9645 నంబర్ వాహనం బైక్‌ను ఢీ కొట్టింది. జలాలుద్దీన్ కాలు, ముఖానికి రక్తగాయాలయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


ఆదోని టౌన్: పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రి చేరువలో రైల్వే ట్రాక్ పక్కనే ఉన్న వైఎస్సార్ కాలనీలో గురువారం త్రుటిలో అగ్ని ప్రమాదం తప్పింది. క్రాంతినగర్, వెంకన్నపేట ప్రాంతాలకు చెందిన రైతులు కల్లంలో గడ్డివాములను ఏర్పాటు చేసుకున్నారు. అయితే శ్రీసాయి నగర్‌లో ఓ ప్లాట్‌లో పెరిగిపోయిన ముళ్లపొదలు, గడ్డి, చెత్తా చెదారాన్ని తొలగించి నిప్పు పెట్టారు. గాలికి మంటలు ఎగిసిపడ్డాయి. రవ్వలు గడ్డివాములకు దగ్గరగా పడి రోడ్డు పక్కనే ఉన్న చెత్తాచెదారం అంటుకుంది. అంతలో స్థానికులు గుర్తించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్ సకాలంలో వచ్చి మంటలను ఆర్పి వేసింది. ఫైరింజన్ రాకపోయుంటే రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షలు విలువ చేసే గడ్డివాములు అగ్నికి ఆహుతై ఉండేవని రైతులు చెబుతూ ఊపిరి పీల్చుకున్నారు.

కడుపునొప్పితో వృద్ధుడి ఆత్మహత్య

ఆదోని టౌన్: కోసిగికి చెందిన అయ్యన్న (70) కడుపునొప్పి తాళలేక గురువారం తెల్లవారుజామున ఇంటి వద్దనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుమారుడు నరసప్ప, కుటుంబ సభ్యులు బాధితుడిని ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందినట్లు కోసిగి ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. మృతుడి కుమారుడు నరసప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. మృతుడికి నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం ఉన్నారు.

జోరుగా ఉపాధి పనులు

నందవరం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. వ్యవసాయ పనులు తక్కువగా ఉండడంతో కూలీలు ఉపాధి పనులకే మొగ్గుచూపుతున్నారు. అధికారులు అవగాహన కల్పించడంతో యువకులు, మహిళలు అధిక సంఖ్యలో ఉపాధి పనులకు తరలివస్తున్నారు. దీంతో పని ప్రదేశాల్లో కూలీలతో జాతరను తలపిస్తోంది. ఉపాధి కూలీలు చెక్‌డ్యాంలు, చెరవులు, కాలువలో పూడికతీత పనులు చేపడుతున్నారు. మండలంలో దాదాపు 5,050 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారని, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ శ్రీనివాసులు సూచించారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

వైభవంగా తొలిఏకాదశి



భజన చేస్తున్న భక్తులు

పాణ్యం: మండలంలో గురువారం తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. విష్ణు క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీ వీరనారాయణ స్వామి ఆయలంలో ప్రధాన అర్చకులు సుబ్బశాస్త్రి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా ఎస్సార్బీసీ కాలనీలో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి తెల్లవారుజామున నుంచి కైంకర్యాలు చేశారు. అర్చకుడు మురళీ ప్రత్యేక పూజలు చేశారు.
సి.బెళగల్: తొలి ఏకాదశి సందర్భంగా గురువారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తుల ఉపవాస దీక్షలతో ఆలయాలకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక శ్రీ రంగనాథుడు ఆలయం, బస్టాండ్‌లోని ఈశ్వరాలయం, కోట వీధులోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయం, క్రిష్ణదొడ్డి గ్రామంలోని కొండపై వెలసిన శ్రీ కోనవేంకటేశ్వర స్వామి ఆలయం, పోలకల్ గ్రామంలోని శ్రీ చెన్న సోమేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు.
గూడూరు: పట్టణంలో గురువారం తొలి ఏకాదశి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయ స్వామి, అంభ భవానీ మాత, నీల కంఠేశ్వర స్వామి, తిమ్మ గురుడు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామి వారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో పాండు రంగస్వామిని ఊరేగించారు.
కల్లూరు: ఆషాడ శుద్ధ తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం కల్లూరు అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో భక్తులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీ ఈశ్వర, వీరభద్ర, భీమేశ్వర స్వామి తదితర దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కల్లూరులో వెసలసిన శ్రీ భీమేశ్వరస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కార్పొరేటర్లు నరసింహులు, శ్రీనివాసులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు వీరేంద్ర కుమార్(చైర్మన్) ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ఆఖండ భజన కార్యక్రమం నిర్వహించారు.



భీమేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన కల్లూరు అర్బన్ 28వ వార్డులోని బీఆర్ రెడ్డి కాలనీలో కార్పొరేటర్ నారాయణరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి పథకాలపై ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా స్పందించిన ఎమ్మెల్యే వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మీకాంతరెడ్డి, జయరాముడు, నరసింహులు, విక్రమసింహారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డ్ చైర్మన్ మీది వేముల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలం విషయంలో ఇరువర్గాల ఘర్షణ

- 16 మందికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: పొలం విషయంలో గురువారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి 16 మందికి గాయాలయ్యాయి. పోలీసులకు తెలిపిన వివరాల మేరకు.. గుడేకల్ గ్రామానికి చెందిన చాకలి పెద్ద నల్లన్న కొన్ని సంవత్సరాలుగా ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటూ పట్టాదారు పాస్ పుస్తకం పొందాడు. అయితే పొలం పక్కనే ఉన్న బోయ పెద్ద గుంటెప్ప తనకూ ఈ ఐదు ఎకరాలపై హక్కు ఉందని గొడవపడేవాడు. సమస్య పోలీసులు, రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లడంతో రెవెన్యూ రికార్డుల ప్రకారం ఐదు ఎకరాలపై హక్కు చాకలి పెద్ద నల్లన్నకే ఉందని తేల్చి చెప్పారు. అయితే గురువారం పొలం పనులకు వెళ్తున్న చాకలి పెద్ద నల్లన్న కుటుంబ సభ్యులతో బోయ పెద్ద గుంటెప్ప కుటుంబ సభ్యులు వాగ్వాదానికి దిగారు. ఇరు వర్గాల వారు రాళ్లు కర్రలు, కారంతో దాడులు చేసుకోవటంతో 16 మందికి గాయాలయ్యాయి. గాయపడిన చాకలి పెద్ద నల్లన్న, శ్రీనివాసులు, నడిపి నల్లన్న, తిమ్మప్ప, వెంకటేష్, తిప్పన్న, నడవలయ్య, రాజు, ఈరమ్మ, లక్ష్మి, మల్లమ్మ, బోయ పెద్ద గుంటెప్ప, నడవలయ్య, ఆంజనేయులు, నాగమ్మ, సునీతను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ పి.నిరంజన్‌రెడ్డి తెలిపారు.



గాయపడిన బోయ పెద్ద గుంటెప్ప వర్గీయులు



చాకలి పెద్ద నల్లన్న వర్గీయులు

విద్యార్థులు లక్ష్యసాధనే ధ్యేయంగా చదవాలి

కర్నూలు (అర్బన్): లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆ దిశగా చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె.రంగ లక్ష్మీదేవి విద్యార్థులకు సూచించారు. గురువారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన మోటివేషన్, అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలు చేరుకుని, తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు, సహాయ సంక్షేమ అధికారి బి.మద్దిలేటి, మోటివేషన్ స్పీకర్ కె.మహేంద్ర, డీవీఎంసీ సభ్యులు వై.రాజు, కె.శాంతికుమార్, యు.రమేష్ బాబు, సీనియర్ న్యాయవాది కె.రామకృష్ణారెడ్డి, హెచ్‌డబ్ల్యూఓలు కె.వెంకటరెడ్డి, జి.సుంకన్న, బెన్నమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేడీ రంగలక్ష్మీదేవి